క్లుప్తంగా

ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



నెహ్రూనగర్: ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తామని ప్రజారోగ్యాధికారులు తెలిపారు. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన ఇదేనా 'ప్రత్యేక' డ్రైవ్ అనే కథనానికి నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు స్పందించారు. రత్నపురి కాలనీలో రోడ్లపై ఉన్న చెత్త, కృష్ణనగర్‌లో అధ్వానంగా ఉన్న డంపర్ బిన్‌ను శుభ్రం చేయించారు. సాక్షి కథనానికి స్పందించి మా ప్రాంతంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రజక సంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ

నెహ్రూనగర్: గుంటూరు టౌన్ రజక జన సేవ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఎర్ర చెరువు పరిరక్షణకు శనివారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాత గుంటూరులోని శ్రీ గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో సభ నిర్వహించనున్నట్లు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నడిబొడ్డులోని ఎర్రచెరువును కబ్జా చేసేందుకు అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కొంత మంది కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబయ్య, సురేష్, గణేష్, నాగయ్య, ఆంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం రాత్రి శ్రీమద్భగవద్గీతలోని దశమ అధ్యాయంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి సందేశాన్ని అందించారు.

అండర్-9 రాష్ట్ర పోటీల్లో చేతన్‌కు ప్రథమ బహుమతి



గుంటూరు వెస్ట్: ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-9 విభాగంలో తమ అకాడమి విద్యార్థి ఎం.చేతన్‌కు బంగారు పతకం, అండర్-7 పి.గగన్‌కు తృతీయ స్థానం లభించిందని రూఫ్‌రైడర్స్ చెస్ అకాడమి కోచ్ ఎస్.రాంబాబు శుక్రవారం తెలిపారు. ఇటీవల చిన్నారులు ఇద్దరూ జిల్లా పోటీల్లో నిలకడగా రాణిస్తున్నారని చెప్పారు. చిన్నారులకు పలువురు అభినందనలు తెలిపారు.


వీవీఐటీలో ప్రయుక్తి- 2024 సాంకేతిక సదస్సు

పెదకాకాని: పరిశ్రమ అవసరాలను అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని కోట కార్పొరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోమ సుమన్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్, నిర్మాణభ్రష్ట విద్యార్థి విభాగంఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సు, ప్రయుక్తి 2కె24 సాంకేతిక వేడుకలను ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కోట కార్పొరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోట సుమన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట సుమన్, సివిల్ ఇంజినీర్లు నిర్మాణాలలో అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వినియోగం ద్వారా నిర్మాణాల నాణ్యతను ఏవిధంగా తెలుసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. రెండురోజులపాటు నిర్వహించనున్న సదస్సులో క్లాష్ ఆఫ్ మైన్డ్స్, క్రిప్టిక్ క్విస్ట్, స్ట్రక్చరల్ కనెక్టివిటీ, క్లాష్ ఆఫ్ క్యాడ్ అంశాలపై సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అడ్మిన్ డీన్ డాక్టర్ కుమారస్వామి, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీధర్ బాబు, సంధానకర్త చందన సుభాష్ పాల్గొన్నారు.



'ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎం.గోపీకృష్ణారెడ్డి. పట్నంబజారులో నివాసం ఉంటాడు. ఓ ప్రైవేటు క్రిమిసంహారక మందుల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇతడి తండ్రి ఇంటికి వస్తున్నారు. ఇంటి సమీపంలో కొందరు అడ్డుకున్నారు. జేబులో ఉన్న డబ్బులు గుంజుకున్నారు. ఇది గమనించిన కృష్ణారెడ్డి వెంటనే అక్కడకు వెళ్లాడు. ఇదేమని ప్రశ్నించారు. రెచ్చిపోయిన బ్లేడ్ బ్యాచ్ కత్తి, బ్లేడ్‌తో దాడి చేశారు. కంటి గాయం కావడంతో చికిత్స పొందుతున్నాడు..' దీనిపై లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెబుతున్నాడు.

పేట్రేగుతున్న బ్లేడ్ బ్యాచ్



భయం.. భయం...

- శానిటైజర్, గంజాయి మత్తులో దాడులు
- అర్ధరాత్రి వేళ నగదు కోసం బెదిరింపులు
- నగరంలో పలు ప్రాంతాల్లో ఆగడాలు

పట్నంబజారు: నగరంలో బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోతోంది. మహిళ, వృద్ధులు టార్గెట్ చేస్తున్నారు. గంజాయి, మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. కత్తులు, బ్లేడ్‌లతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో దుస్థితి మరింత దారుణంగా మారింది. ఒక ముఠాలా ఏర్పడి దాడులు చేస్తున్నారనే తెలుస్తోంది. డబ్బులు అడగగానే ఇస్తే సరే సరి... లేకుంటే మాత్రం బ్లేడులతో దాడి చేస్తున్నారని స్థానిక ఆటోవాలలు, చిరువ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక వృద్ధుడిని బ్లేడ్ బ్యాచ్‌తో గొంతు కోసి.. అతడి వద్ద చిల్లర లాక్కుని వెళ్లిపోయిన ఘటన ఉందంటే పరిస్థితి అర్థం అవుతోంది.

సగం పూర్తి అయిన భవనం కేంద్రంగా...

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా సగం పూర్తి అయిన కార్పొరేషన్ భవనాన్ని అడ్రస్‌గా చేసుకుని బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోతున్నట్లు సమాచారం. సాయంత్రం వేళల్లో మద్యం, గంజాయి, శానిటైజర్, వైటనర్‌లు తాగి అటుగా వెళ్లే వారిని భయపెట్టి డబ్బులు లాక్కున్న ఘటనలు ఉన్నాయి. పాతగుంటూరు పోలీసుస్టేషన్ పది అడుగుల దూరంలో ఉన్నప్పటికీ.. కనీసం పోలీసులు పట్టించుకోకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువకులు ఒక గ్రూపుగా ఏర్పడి.. ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఒక బార్ వద్ద, బస్టాండ్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణాల వద్ద కాపు కాచి భయపెట్టి నగదు, సెల్‌ఫోన్‌లు దోచుకుపోతున్న ఘటనలున్నాయి.

పల్నాడు బస్టాండ్ సెంటర్...

నగరంలో అత్యంత రద్దీగా ఉండేది ప్రాంతాల్లో మార్కెట్ వద్ద పల్నాడు బస్టాండ్ సెంటర్. అటువంటి ప్రాంతంలో కూడా వ్యాపారులు, పనులు చేసుకుని నివాసాలకు వెళ్లే వారు భయపడాల్సిన దుస్థితి. గత కొద్ది రోజుల క్రితం పల్నాడు జిల్లాకు చెందిన ఒక రైతును భయపెట్టి అతడి వద్ద రూ.12 వేలకు పైగా లాక్కుని వెళ్లిపోయారు. రాత్రి వేళల్లో షాపులు మూసి వెళ్లాలంటే భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి కిందే స్థిర నివాసాలు....

నగరంలోని అరండల్‌పేట, మణిపురం, కంకరగుంట ఓవర్‌బ్రిడ్జిల వద్ద బ్లేడు బ్యాచ్‌లు స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి. గతంలో అరండల్‌పేట ఓవర్‌బ్రిడ్జి కింద ఒక వ్యక్తిపై బ్లేడు బ్యాచ్ దాడి చేసి.. డబ్బులు లాక్కుని పరారైన ఘటన ఉంది. ఇప్పుడు మాత్రం మరోసారి బ్లేడు బ్యాచ్‌లు హల్‌చల్ సృష్టిస్తున్నాయి.

ఇదీ నిత్యకృత్యమే.....

నగరంలోని కొత్తపేట పోలీసుస్టేషన్ పరిసర ప్రాంతాల్లో లాడ్జిలు అధికంగా ఉంటాయనేది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. ఈ క్రమంలో నేరుగా కొంత మంది వ్యభిచారులు రోడ్డుపైనే ఆయా మద్యం దుకాణాల వద్ద కాపు కాసి, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని వారితో మాటలు కలుపుతారు. తొలుత వారి ప్రణాళికలో భాగంగా ఒక ఆటోను పిలిపించి నిర్మానుష్య ప్రాంతానికి వెళ్దామని చెప్పి, వారిని అక్కడ భయపెట్టి, అవసరమైతే దాడి చేసి డబ్బులు లాక్కుంటున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇటువంటి ఘటనలకు సంబంధించి కేసులు పెడితే.. ఎక్కడ పరువు పోతోందోనని బాధితులు ముందుకు రావటం లేదని సమాచారం.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



లక్ష్మీపురం: అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలని అవగాహన సంస్థ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ ఆర్.వి సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గైడెన్స్ సెల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించేందుకు అవగాహన సంస్థ కృషి చేస్తోందన్నారు. విద్యావేత్త ముప్పాళ్ళ వి.ఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు గుంటూరు నగరంలో 5 వేలకు పైగా ఓటరు నమోదు ఫారం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.భావన్నారాయణ, వెంకటరత్నం, సిహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

రతన్ టాటా సంస్మరణ సభ

నిబద్ధత, దార్శనికత, అసాధారణ నైతిక నిష్ఠలతో అత్యున్నత విజయాలు సాధించిన అసామాన్యుడు రతన్ టాటా అని విశ్వజనీన విలువలకు కట్టుబడి రతన్ టాటా జీవితం ఒక పాఠ్యాంశమని జాతి గుండెల్లో ఆయన స్థానమెప్పటికీ పదిలమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రతన్ టాటా సంస్మరణ సభలో తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇండస్ట్రియల్ కన్సల్టెంట్ వి.వి.రావ్ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నల్లపాడు రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో సామాజిక రిజర్వేషన్లు 50శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు, ఈనాడు అగ్రకుల పేదలకు ఈడబ్ల్యూఎస్ పేరిట 10శాతం ఇస్తూ పరిమితి మించిపోయేలా కేంద్రం చట్టం చేస్తే దానిని సుప్రీం కోర్టు ఏ విధంగా సమర్థిస్తుందని ప్రశ్నించారు. సాంఘికంగా, విద్యపరంగా వెనుకబడిన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వబడ్డాయని, ప్రస్తుతం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి విరుద్ధంగా, ఆర్థిక ప్రాతిపదికన అధిపత్య కుల పేదలకు ఈడబ్ల్యూఎస్ పేరిట రిజర్వేషన్లు అమలుచేయడం, సామాజిక న్యాయ సత్రాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఆధిపత్య కుల పెత్తందారీ వర్గాలతో ఆర్థికంగా వెనుకబడిన పేదలు 10శాతం కూడా ఉండరని, పైగా వారెవరు ఎప్పుడు అడగకుండానే, ఎట్టి నిరసనలు చేపట్టకుండానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అత్యుత్సాహంతో 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడం అణగారిన రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం చేయడమేనన్నారు. సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ నిజంగా అగ్రకుల పేదల ఆర్థికాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి, ఆర్థిక పథకాలు ద్వారా వారిని పైకి తీసుకురావచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తొమ్మిది మంది జడ్జిలకు మించిన విస్తృత ధర్మాసనం ద్వారా విచారించి అణగారిన వర్గాలకు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరంగా చేపట్టాలి

అదనపు కమిషనర్ ఓబులు



నగరంలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ ఓబులు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేకంగా చేపట్టిన 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరం చేయాలని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన అధికారులు మరింత శ్రద్ధగా పర్యవేక్షణ చేయాలని అదనపు కమిషనర్ ఓబులు కోరారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడానికే 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన 22 మంది సీనియర్ అధికారులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి అంతరాయం కల్గించే ఆవులను పట్టించి ప్రత్యేక వాహనాల ద్వారా నగరపాలక సంస్థ బందెల దొడ్డికి తరలించడం, వీధి కుక్కలను పట్టించి ఏబీసీ ఆపరేషన్లు, వ్యాక్సిన్ కార్యక్రమాల తనిఖీ చేయాలన్నారు. శివారు కాలనీలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు (గ్యాంగ్ వర్క్) ద్వారా కాలువలు, వీధులు శుభ్రపర్చటం వంటి కార్యక్రమాల ద్వారా మొత్తం 90 రోజులలో గుంటూరు నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దే విధంగా ప్రణాళికల ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు హర్షణీయం



ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చిత్రపటాలకు క్షీరాభిషేకం

గుంటూరు మెడికల్: శంకర విలాస్ బ్రిడ్జి విస్తరణ పనుల కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ నేతలు అన్నారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం 4వ మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, మంత్రి నితిన్ గడ్కరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జూపూడి రంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా బ్రిడ్జి నిర్మాణానికి రూ.98 కోట్లు నిధులు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్ర రాజధానికి విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు తదితర ప్రాజెక్టులకు కేంద్రం తమ వంతు సహకారాన్ని అందజేస్తుందన్నారు. బ్రిడ్జి విస్తరణ పనులు పూర్తయితే నగరవాసుల ట్రాఫిక్ సమస్య తీరుతుందని వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు వెంకట సుబ్బారావు, చెరుకూరి తిరుపతిరావు, కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్, దారా అంబేద్కర్, దర్శనం శ్రీనివాస్, ఆవుల వెంకటేశ్వరరావు, తాడువాయి రామకృష్ణ, ప్రతాప ప్రసాదు, ఆవుల వెంకటేశ్వరరావు, పెసల వెంకటేశ్వరరావు, స్టాలిన్, జితేంద్ర గుప్తా, పార్థసారథి, చంద్రశేఖర్, సురేష్ చౌదరి, సాయి పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఈపే ల్యాబ్స్ గురించి వివరిస్తున్న హెచ్‌ఆర్ విభాగాధిపతి జాన్ డేవిడ్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో శుక్రవారం ఈపే ల్యాబ్స్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారని తెలిపారు. రాత పరీక్ష, బృంద చర్చ, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపికలు నిర్వహించారని, ఎంపికైన అభ్యర్థులకు మూడురోజుల్లో నియామక పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఈపే ల్యాబ్స్ హెచ్‌ఆర్ విభాగాధిపతి జాన్ డేవిడ్ పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతులు డాక్టర్ డీవీ చంద్రశేఖర్, డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులతో విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన కార్యక్రమం లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ బాలుర విభాగంలో ఏ శశి, టి.షణ్ముఖ్, టి.గణేశ్వర్ తృతీయస్థానం, బాలికల విభాగంలో ఏ అక్షయ, పి.శరణ్య కాంస్య పతకాలు పొందారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈసందర్భంగా కోచ్ రవిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగింపు



డ్రెయిన్‌పై ఉన్న దుకాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై ఆక్రమణలను దశల వారీగా తొలగిస్తామని, ప్రజా సౌకర్యార్థం ఆక్రమణదారులు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల, రైలుపేట ప్రధాన రహదారిలో డ్రెయిన్ మీద, రోడ్ల మీద ఆక్రమణలను ఏసీపీ మల్లికార్జున ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అక్రమ ఆక్రమణ దళం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణల వలన వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేయడానికి డ్రెయిన్‌లో పారుదల లేక సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లపై ఆక్రమణలను గుర్తించి, వాటిని వారంతట వారే తొలగించుకోవాలన్నారు. స్పందించని ఆక్రమణలను ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు తొలగిస్తారని స్పష్టం చేశారు. వార్డు సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుత వర్షాల వలన నగరంలో ఏ ప్రాంతంలో నీరు నిలిచి ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారో ఆయా ప్రాంతాల్లో భవిష్యత్‌లో సమస్యలు రాకుండా తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు ప్రధాన డ్రెయిన్లను వివిధ వ్యాపారాల పేరుతో ఆక్రమణ చేసుకోవద్దని, తప్పనిసరిగా డ్రెయిన్‌కి వెనుక వైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గుంటూరు రూరల్: పంటల్లో నష్టం, అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్న కోండ్రుపాడు గ్రామానికి చెందిన గడ్డం గోపాలకృష్ణ(31) ఐదు ఎకరాలు సాగు చేస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్లుగా పంటల్లో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నాడు. మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంటి నుంచి పొలం వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. ఇంట్లోని వారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటంతో శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిచూడగా విగత జీవుడై పడి ఉన్నాడు. దీంతో పోలీసులుకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులతో కృష్ణప్రసాద్, రత్తయ్య, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పురస్కారాలు అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ కర్ణాటక మ్యూజీషియన్స్, డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించిన రావణకుర్త విరచిత శివ తాండవం ప్రపంచ రికార్డ్స్‌లో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని చావలి లక్ష్మీచేతన, యూకేజీ విద్యార్థిని బజిన కమలి ప్రశంసాపత్రం అందుకున్నారని తెలిపారు. అదే విధంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కాశీ విశ్వనాథ ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఇదే కార్యక్రమంలో విద్యార్థులు లక్ష్మీచేతన, బజిన కమలి ప్రశంసాపత్రాలు పొందారని వివరించారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో పశ్చిమగోదావరి స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇంటర్ స్టేట్ పోటీల్లో 11వ తరగతి విద్యార్థి షేక్ మెహరాజ్ హైజంప్‌లో ప్రతమ బహుమతి, లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి పొందారని తెలిపారు. విద్యార్థులను క్రీడలు, లలిత కళలు, సాంస్కృతిక అంశాల్లో ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నేడు హిందూ ఫార్మసీలో ప్రీలోక్‌మతన్

గుంటూరు వెస్ట్: మన దేశ ప్రాచీన ప్రముఖ్యతను పరిచయం చేసేందుకు ప్రీలోక్‌మతన్ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు థింక్ భారత్ వ్యవస్థాపకులు డీఎస్ఆర్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశ్రాంత హైకోర్టు జడ్జి బలుసు శివ శంకరరావు హాజరవుతారని చెప్పారు.

నారాకోడూరులో మహిళ మృతదేహం లభ్యం

చేబ్రోలు: గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. వివరాలు.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామశివారులోని ఈస్టన్ కంపెనీ సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మహిళ మృతి చెందింది. మహిళపై ఎటువంటి గాయాలు లేకపోవటం, పురుగుమందు తాగిన ఆనవాళ్లు లేకపోవటంతో పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ డి.వెంకటకృష్ణ కేసు నమోదు చేశారు.